అందమైన
అమ్మాయిని
ఒకే దృష్టితో
చూసే అతనికి
కలిగిన కనువిప్పు?

# గ్రేట్ లవర్

ఓ. లక్ష్మీదేవి
కథ

"వేసవి మొదలు కావటంవల్ల ఉదయం తొమ్మిదిన్నరకే సూర్యుడు తవ ప్రతాపం చూపడానికి సమయత్త మౌతున్నాడు.

దెబ్బతిన్న పరుష వంతుడిలా చురుక్కుమంటోంది ఎండ.

మధ్యతరగతి వాడి బ్రతుకులోని బాధలా వేసవిలో ఈ ఎండ బాధకొటి. ఛ! ఛ!!

ఆఫీసుకెళ్ళడానికి స్టాపింగ్‌లో నిల్చున్న కౌశిక్ అది పదవసారి విసుక్కోవడం.

అబ్బ! నిలబడలేక చస్తున్నా! ఈ బస్సొకటి వెధవ బస్సు ఎంతకీ రాదు. అసహనంగా వున్న కౌశిక్ విసుగు బస్సుమీద మళ్ళింది.

బస్సు వస్తుందేమోనని రోడ్డువైపు చూడటానికి తలతిప్పిన కౌశిక్ చూపులు తనకు కాస్త దూరంలో పుస్తకాలతో నిలబడ్డ అమ్మాయి పైనే నిలిచి పోయాయి.

వాట్ ఎ స్టన్నింగ్ బ్యూటీ!

ఎవరీ అప్సరస!

తళుక్కున మెరిసే అందమయిన వళ్ళు. సంపెంగ లాంటి ముక్కు. గులాబీ రేఖల్లాంటి బుగ్గలు. దొండపళ్ళలాంటి పెదవులు. శంఖం లాటి మెడ. ఏ కథానాయికనో మితిమీరి వర్ణించినట్టుగా ఏమిటీ వర్ణనా... కాపీవర్ణన... వెధవ వర్ణన... ఛీ! ఛీ!!

అందాల రాణి... నాపూబోణి... నా ప్రేమవాణి... ఉహూ! ఇలా మరీ పాస్టీగా ఉంది.

ప్రత్యూషంలో మంచు బిందువులతో తడిసిన అరవిరిసిన గులాబీలా, సున్నితంగా స్పృశించినా కందిపోతుందేమో నన్నంత లేతగా, మృదువుగా... అవును అలాగే



వుంది... ఓహ్!... ఎంత అందం అనుకున్నాడు కౌశిక్.

అంతకంటే ఆశ్చర్యం ఆ అమ్మాయి కౌశిక్ వైపే చూస్తోంది. ఆ అమ్మాయి నుండి చూపు మరల్చుకోవడానికి ఇష్టపడని మనసును, కళ్ళకు పగ్గంవేసి లాగినట్టుగా అతి ప్రయత్నంమీద చూపు మరల్చుకున్నాడు కౌశిక్.

అప్పుడే అందరిలో కలకలం. తలెత్తి చూస్తే దూరంగా తనెక్కవలసిన బస్సు. అంత తొందరగా తగలడకపోతే కాస్సేపుంటే ఏం పోయేదో? బస్సు తొందరగా వచ్చినందుకు మొదటి సారిగా విసుక్కున్నాడు.

ఆ అమ్మాయి కూడా కౌశిక్ ఎక్కిన బస్సే ఎక్కింది.

రోజూ అక్కడ తారసపడేవారు. ఆ అమ్మాయి కాలేజీకి, కౌశిక్ ఆఫీసుకు అదే బస్సులోనే వెళ్ళేవారు. ఓరగా ఆమెను గమనిస్తూ ఉండేవాడు. ఆ అమ్మాయి కౌశిక్‌ను అప్పుడప్పుడు చూస్తుండేది. ఓ రోజు ధైర్యంచేసి చూపు కలిపేసేదు. కౌశిక్ తనను చూడటం చూసి మెల్లగా చిరునవ్వు నవ్వింది.

హుర్రే! అంటూ బయటకు రాబోయిన కేకను గొంతుకలోనే నొక్కేసాడు.

అతడు తనవైపు చూడటం చూసి "హల్లో! గుడ్ మార్నింగ్" అంది.

గుడ్ మార్నింగ్! మేరేంటండి పేరు... అబ్బెబ్బే.. మీ పేరేంటండి? ఆ అమ్మాయి తనను పలకరించడంతో తత్తర పడిపోయాడు.

"నా పేరు రాధ. ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నా. మీ పేరేమిటండి?"

నాపేరు కౌశిక్. బ్యాంక్‌లో సర్వీస్.

అలా మొదలయింది వారి పరిచయం. రోజు అక్కడ కలుసుకున్నప్పుడు కబుర్లు చెప్పుకొనేవారు. రాధ ఎంతో ఫ్రీగా మాట్లాడేది.

రాధతో మాట్లాడుతున్నంత సేపు కౌశిక్ కాళ్ళు నేలమీద ఆనేవి కాదు. రంగుల హరివిల్లులో విహరించేవాడు. రాధతో ఏకాంతంగా ఆనంద విహంగంలా ఎగిరిపోయేవాడు.

రాధను తను ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయం ఆమెకు ఎలాగయినా చెప్పెయ్యాలి అని రోజూ అనుకుంటూనే వున్నాడు. తీరా రాధ ఎదురు పడే సరికి ఆ విషయం చెప్పలేక పోయేవాడు.

"మీకు రేపు ఆఫీసుందా?" అడిగింది రాధే ఓరోజు

ఎందుకుండదు? హాలీడేకాదు కదా?"

రేపు మీరు సెలవు పెట్టగలరా?"

"రేపా? ఎందుకు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"రేపు మీరు మా యింటికి రాగలరా? దయచేసి తప్పక రావాలి" అంది అభ్యర్ధనతో.

మీ ఇంటికా? ఎందుకు? మరింత ఆశ్చర్యంగా అడిగాడు.

"మిమ్మల్ని మా అమ్మకు చూపించాలి"

ఎందుకూ అనబోయి మింగేశాడు.

అంతకంటే తెలివితక్కువ ప్రశ్న మరొటుండదు.

ఆ రాత్రి నిద్రపోలేదు కౌశిక్. రంగు రంగుల కలల్లో విహరించాడు. మధురమయిన ఊహల్లో తేలి సోలిపోయాడు.

రాధ తనకంటే ఫాస్ట్. మొదట తనే చిరునవ్వు నవ్వింది. తనే మాట కలిపింది. ఇప్పుడు ఇంటికి కూడా తనే ఆహ్వానించింది. హూ డేర్ షి. తన అభిప్రాయం

తెలుసుకోకుండానే... తెలుసుకోకుండానే ఏమిటి? తన అంతరంగం మౌనంగా చదివేసినట్టుంది రాధ.

తనను వాళ్ళ అమ్మకు చూపించాలట. రాధ తల్లికి తను నచ్చితేనే కదా పెళ్ళి మాటలు. ఎందుకు నచ్చడు. తనకేం తక్కువ? చదువు, అందం, ఉద్యోగం అన్నీ ఉన్నాయి. ఈ క్వాలిఫికేషన్స్ వారికి చాలవేమో? ఏమో చూడాలి...

రకరకాలుగా ఊహిస్తున్న మనసును నిద్రబుచ్చడానికి ప్రయత్నిస్తూ గట్టిగా కళ్ళు మూసుకున్నాడు కౌశిక్.

మరసటిరోజు ఉదయమే లేచి స్నానం చేసి, టిఫిన్ చేసి నీటుగా డ్రస్ అయ్యాడు. అద్దం ముందు నిల్చొని తల దువ్వుకుంటున్న కౌశిక్‌కు తన అందం మీద విశ్వాసం మరింత పెరిగింది. నిజానికి చాలా హాండ్సమ్‌గా ఉన్నాడు అనుకున్నాడు.

గదికి తాళం పెట్టి రాధ ఇచ్చిన అడ్రస్ ప్రకారం వారింటికి బయలు దేరాడు. ఎక్కువ శ్రమ పడకుండానే ఇల్లు కనుక్కోగలిగాడు.

రాధ తల్లి, రాధ కౌశిక్ కోసమే ఎదురు చూస్తున్నారు.

"గుడ్ మార్నింగ్! వస్తారో రారో అనుకుంటూ మీ కోసమే ఎదురుచూస్తున్నాను".

"గుడ్ మార్నింగ్!" రాధతో అవి "నమస్తే!" అంటూ రాధ తల్లివైపు తిరిగి చేతులు జోడించాడు.

"పిలుస్తూనే వచ్చినందుకు చాలా సంతోషం బాబు!" ఆనందం మొహమంతా పాకగా ప్రేమగా అంది ఆవిడ.

ఆమె మొహంలోని ఆనందం కౌశిక్‌ను ఆశ్చర్యపడేలా చేసింది.

"అమ్మ మీ కోసమే చాలా ఎదురు చూస్తోంది" అంది రాధ.

"రా బాబు!" అంటూ లోపలకు దారి తీసింది.

సోఫాలో కూర్చోబోతూ ఎదురుగా

## చిలిపినిర్ణయం



అత్యధిక వికెట్లనే కాక అయిదువేలకు పైగా పరుగులను కూడా టెస్ట్ క్రికెట్‌లో సాధించిన కపిల్‌దేవ్‌కు స్కూలులో చదువుతున్న రోజులలో... ఓ ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురయిందట! పద్మాలుగేళ్ల ఫుట్‌బాల్‌లలో ఏదో ఒక 'గేమ్'ను సెలక్ట్ చేసికొని దానిని ఆడమని ఆదేశించాడట! స్కూలు బయట ఎక్కువసేపు ఉండవచ్చుననే ఉద్దేశంతో 'క్రికెట్'నే సెలక్ట్ చేసుకున్నానని కపిల్ ఈ మధ్య ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు! చిన్న వయసులో తీసికున్న ఆ 'చిలిపి' నిర్ణయం... అతడికి ఎంతకీర్తి ప్రతిష్ఠల్ని అందించిందో వేరే చెప్పనవసరం లేదుకదూ!

– జూపిటర్

గోడనున్న ఫోటో చూశాడు.

అరుణవర్ణపు బొట్టుతో చిరునవ్వు చిందిస్తున్న యువకుడి ఫోటో ఫ్రేంకు వ్రేలాడుతున్న పువ్వుల దండ. ఎందుకో ఫోటోలోని అబ్బాయి కూడా తనలాగే ఉన్నాడేమో అనిపించిందో క్షణం కౌశిక్‌కు.

అందంగా నవ్వుతోన్న అబ్బాయి లేడనుకుంటే మనసు కలుక్కుమంది. బాధ్యతలే తెలియని లేబ్రాయపు ఆనందమయ జీవితంలో... తను చేరాలనుకున్న సుందర ద్వీపం లాంటి గమ్యానికి గమనం సగమైనా సాగకుండానే తను అల్లుకున్న ఆశల హరివిల్లులాంటి జీవితాన్ని ప్రారంభించకుండానే విధి చేసిన విషపు కాటుకు గురైన ఆ యువకుడి ఫోటో చూసి ఎవరి జీవితమైనా అశాశ్వతమే సుమా అనిపించింది కౌశిక్‌కు.

''ఏమిటి బాబు! అలా చూస్తున్నావు? ఫోటోలో ఉన్నది మా అబ్బాయి ప్రమోద. రెండు సంవత్సరాల క్రితం స్కూటర్ యాక్సిడెంట్‌లో మరణించాడు. మాయింటి దీపం, మా సర్వస్వమూ అయిన అబ్బాయి అర్ధాంతరంగా అంతర్థానమై పోతే మేమిలా జీవచ్ఛవాల్లా బతుకుతున్నాం బాబు'' ఆమె కంఠం దుఃఖంలో పూడుకుపోయింది.

''అమ్మాయి చాలా రోజుల నుంచి చెబ్తోంది బాబు! అన్నాయ్య లాగే ఉన్నాడమ్మా ఒకాయన. రోజూ బస్‌స్టాప్‌లో కనిపిస్తారు. నాతో బాగా మాట్లాడతారు. ఆయన్ని చూస్తే నాకు అన్నయ్యను చూసినట్లే అనిపిస్తుందని''.

''నాకూ నిన్ను చూడాలన్పించింది. ఒక్కసారి మనింటికి తీసుకు రమ్మని రోజూ పోరుతున్నాను. కొత్తాయన ఇంటికి రమ్మని ఎలా పిలవనమ్మా అంటోంది బాబు.—ఈరోజు నాపోరు పడలేక ఆఫీసుకు సెలవు పెట్టి నిన్ను పిల్చింది. నిన్ను చూస్తుంటే మా అబ్బాయిని చూసినంత ఆనందంగా ఉంది బాబు'' ఆమె కంఠంలోని దుఃఖఛాయ ఇంకా తగ్గిపోలేదు.

''అవునన్నయ్యా! నా మనస్సు స్వంత అన్నయ్యలా గుర్తిస్తోన్న అన్నయ్య అంటూ సన్నిహితంగా పిలవాలన్నా, అమ్మ కోరిక తీర్చడం కోసం ఇంటికి ఆహ్వానించాలన్న చాలా రోజుల వరకు నాకు మొహమాటం అన్పించింది. అందుకే పిలవలేక పోయాను. పిలవగానే కాదనకుండా వచ్చి అమ్మకు ఆనందం కలిగించినందుకు నీకు కృతజ్ఞతలన్నయ్య'' రాధ కంఠంలోని ఆత్మీయతతోపాటు కంట్లో పల్చటి నీటిపొర.

తబ్బిబ్బుపడిపోయాడు కౌశిక్. హృదయంలో ఆనంద కెరటాలు ఎగసి ఎగసి పడుతుండగా మధురమయిన ఆలోచనలతో తనొస్తే ఈ తల్లీ కూతుళ్ళేమిటి ట్రాజిడీ సీను క్రియేట్ చేస్తున్నారు. వెధవ సెంటిమెంటు వీళ్ళూను బాడ్ ఎఫినిట్ ఛ! ఛ!!.

ఇంకొక క్షణం కూడా కూర్చోవాలన్పించలేదు కౌశిక్‌కు. తనకు చాలా అర్జెంట్ పని ఉన్నది వెళ్ళొస్తానంటూ లేచాడు.

''భోం చేయందె వెళ్ళనీయ కూడదనుకున్నాం. అదేమిటి అంటూ ఆశ్చర్య పోయారు. మరీ బలవంతం చేస్తే రాధ తెచ్చిన హార్లిక్స్ తాగి వెనకేదో తరుముతున్నట్టు బయట పడ్డాడు.

అందమయిన అమ్మాయి కనిపిస్తే ఒకే కోణంలోంచి చూడటం తప్ప మరోకోణం నుంచి ఊహించడానికి కూడా ఇష్టపడని కౌశిక్‌కు వారి ప్రేమ, అభిమానం సిల్లీగా తోచాయి.

అప్పుడప్పుడు వస్తూండు బాబు అన్న రాధ తల్లి మాటలు జ్ఞాపకం వచ్చాయి.

మరీ ఫూలిష్ లేడీని ప్రేమించి లేనిపోని గోల తెచ్చి పెట్టుకున్నాడు. తన ఆశలమీద నీళ్ళు... కాదు కాదు కళ్ళాపి చల్లారు ఛీ! ఛీ!!

ఈ సారయినా ఇటువంటి వివాదాలేవీ లేని అమ్మాయిని చూసి మరీ ప్రేమించాలి అనుకున్నాడు రాధను ప్రాణాధికంగా ప్రేమించానని అనుకున్న 'ది గ్రేట్ లవర్' మిస్టర్ కౌశిక్.

*

